# మహిళలకు సర్కారు సారీ చెప్పాలి

- విదేశీ అందగత్తెల కాళ్లు కడిగించి ఓరుగల్లు గడ్డ స్ఫూర్తిని దెబ్బ తీసిన కాంగ్రెస్ సర్కారు
- కాస్మెటిక్ కంపెనీలకు లాభాలు తెచ్చేందుకు అందాల పోటీలు నిర్వహించడం దౌర్భాగ్యం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- కడియం..ఒళ్లు దగ్గరపెట్టుకో.. కేసీఆర్, కేటీఆర్, పల్లా పేరెత్తితే నాలుక చీరేస్తా : రాజయ్య

జనగామలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, మే 16 (నమస్తే తెలంగాణ) : రాణీరుద్రమదేవి ధీరత్వం.. సమ్మక్క సారలమ్మ వీరోచిత పోరాటస్ఫూర్తిని దెబ్బతీసేలా తెలంగాణ మహిళలతో విదేశీ అందగత్తెల కాళ్లు కడిగించి ఓరుగల్లు పరువుతీసిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జనగామలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వం దివాలా తీసిందని ప్రకటించిన ముఖ్యమంత్రి కాస్మెటిక్ కంపెనీలకు లాభాలు తెచ్చే ప్రపంచ అందాలపోటీలు నిర్వహించడం దౌర్భాగ్యమని ధ్వజమెత్తారు. అకాల వర్షాలు, వడగండ్లవానతో దారుణంగా నష్టపోయి కన్నీళ్లు పెడుతున్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం అందాల పోటీలకు వందల కోట్లు వెచ్చించడం శోచనీయమని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కాంగ్రెస్ నాయకులకు పైసా వసూల్‌గా మారుతున్నదని విమర్శించారు. పల్లెల్లో రూ.50వేలు, పట్టణంలో లక్ష రూపాయలు తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. పైసలు ఇచ్చినోళ్లకో.. లేకుంటే కాంగ్రెస్ నేతల బంధుగణానికో పథకం వర్తిస్తున్నదని, పక్కా ఇండ్లకు లంచం తీసుకోవడం చట్ట విరుద్ధమని.. కలెక్టర్ జోక్యం చేసుకొని అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. రాజీవ్ యువ వికాసంలో కూడా పైసల వసూళ్లు మొదలుపెట్టారని ఆరోపించారు.

**కడియం 8 పైసలు కూడా తేలే**

'బీఆర్ఎస్ కార్యకర్తల చెమట చుక్కలు.. ఎమ్మెల్యే పల్లా ఆర్థికసాయంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నావు.. ఒళ్లు దగ్గరపెట్టుకో.. కేసీఆర్, కేటీఆర్, పల్లా పేరెత్తితే నాలుక చీరేస్తా జాగ్రత్త' అని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తీవ్రస్థాయిలో హెచ్చరించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములు సహా అనేక అంశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వాన్ని సుప్రీంకోర్టు ఎండగట్టి, మొట్టికాయలు వేసినా బుద్ధి మారడం లేదని చెప్పారు. సీఎం డబ్బులేవ్ అంటుంటే కడియం శ్రీహరి మాత్రం నియోజకవర్గ అభివృద్ధికి రూ.800కోట్లు తెచ్చానంటూ గొప్పలు చెబుతున్నారని, ఆయన ఇప్పటివరకు 8పైసలు కూడా తేలేదని మండిపడ్డారు. ఇప్పుడు జరుగుతున్న పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. ఈసారి కడియంకు డిపాజిట్ రాదని స్పష్టం చేశారు.

మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్ద మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు, అధికారులతో వివిధ దేశాలకు చెందిన 22 మంది ప్రపంచ సుందరీమణులు

## పిల్లలమర్రిలో అందాలభామల సందడి

ప్రొద్దుటూరు ఎకో ఫ్రెండ్లీ పార్కు సందర్శన

మహబూబ్‌నగర్, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/చేవెళ్ల రూరల్: మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన అందాల భామలు శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పిల్లలమర్రి, రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూరులోని ఎక్స్‌పీరియం ఎకో ఫ్రెండ్లీ పార్కులో సందడి చేశారు. వివిధ దేశాలకు చెందిన 22 మంది ప్రపంచ సుందరీమణులు తొలుత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ బృందానికి కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి ఘనస్వాగతం పలికారు. అనంతరం పిల్లలమర్రి చేరుకొని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. మ్యూజియం వద్ద ప్రపంచ సుందరీమణులతో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీలు కశిరెడ్డి నారాయణరెడ్డి ఫొటో దిగారు. పిల్లలమర్రి ప్రాముఖ్యత గురించి స్క్రీన్ ద్వారా వివరించారు. అనంతరం మహిళలతో కలిసి కొద్దిసేపు బతుకమ్మ ఆడి సందడి చేశారు. మిస్ వరల్డ్ ఆసియా-ఓషియానియా గ్రూప్ నుంచి 24 మంది సుందరీమణులు ప్రొద్దుటూరులోని ఎకో ఫ్రెండ్లీ పార్కును సందర్శించారు. వీరిలో 2024 మిస్ వరల్డ్ కిరీటధారిణి చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా పిస్కోవా కూడా ఉన్నారు. అక్కడ ఉన్న అరుదైన మొక్కలు, వృక్షజాతులు, శిల్పకళా సంపదను వీక్షించారు. అంతకు ముందు ప్రభుత్వం పర్యాటక శాఖ, పార్కు నిర్వాహకుల ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా డోలు, మేళతాళాలతో సుందరీమణులకు స్వాగతం పలికారు. అనంతరం వారు పర్యావరణ అనుకూల బగ్గీలలో ఎక్స్‌పీరియం పార్కులో పర్యటించారు.

## 'మహిళాసంఘాల' ముందస్తు అరెస్టు

భూత్పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మహిళా సంఘాల నాయకురాళ్లు

భూత్పూర్, మే 16 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి సందర్శనకు ప్రపంచ సుందరీమణులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ముందస్తుగా మహిళాసంఘాల నాయకురాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరులోని చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, ఐద్వా కార్యదర్శి పద్మ, అనురాధతోపాటు పలువురిని అదుపులోకి తీసుకొని పాలమూరు, భూత్పూరు పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కోకన్వీనర్ శ్రీదేవి మాట్లాడుతూ రూ.500 కోట్లతో అందాల పోటీలు నిర్వహించడం అవసరమా? అని ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్రంలో పంట కొనుగోళ్లు లేక రైతులు బాధపడుతుంటే.. మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. తెలంగాణ మహిళలతో విదేశీ సుందరీమణుల కాళ్లు కడిగించడం మరీ దారుణమని వారు విమర్శించారు.

## అమెరికాకు ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం అమెరికాకు పయనమయ్యారు. చిన్న కుమారుడు ఆర్య గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొననున్నారు. ఈనెల 23న ఆమె తిరిగి హైదరాబాద్ చేరుకుంటారు.

# దళిత ద్రోహి కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

ఎనాడూ పదవులు ఇవ్వలేదని విమర్శించారు. 1985 నుంచి ఇప్పటి వరకు పార్టీలో ఎంతమంది దళితులకు పదవులు ఇచ్చారో చెప్పాలని నిలదీశారు. 98 మంది అధ్యక్షుల్లో నలుగురు కూడా దళితులు లేరని విమర్శించారు. గాంధీ కుటుంబ సభ్యులు తప్ప మరెవరికీ ప్రధాని పదవి ఇవ్వడం లేదని తెలిపారు. గాంధీయేతర కుటుంబాల నుంచి ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావును అనేక ఇబ్బందులు పెట్టడం నిజం కాదా? అని ప్రశ్నించారు. మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిని చేసినా సోనియానే అధికారం చెలాయించారని గుర్తుచేశారు. 46 ఏండ్లపాటు కాంగ్రెస్ పార్టీకి గాంధీలే అధ్యక్షులుగా కొనసాగారని తెలిపారు. సామాజిక న్యాయమంటే ఇదేనా అని ప్రశ్నించారు. దామోదరం సంజీవయ్య, జగ్జీవన్ రాం, ఖర్గేలు మూడేళ్లు మాత్రమే ఏఐసీసీ పదవుల్లో ఉన్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే దామోదర రాజనర్సింహాకో, వివేక్ వెంకటస్వామికో సీఎం పదవి ఇవ్వాలని సవాల్ విసిరారు.

**కేసీఆర్ క్యాబినెట్‌లో మంత్రిని నేను**

కేసీఆర్ ప్రభుత్వంలో తాను విప్‌గా, మంత్రిగా పదవులు నిర్వహించానని, ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి మర్చిపోయారా? అని కొప్పుల ప్రశ్నించారు. బీఆర్ఎస్ అంతర్గత విషయాలు రేవంత్‌రెడ్డికి ఎందుకని నిలదీశారు. హరీశ్‌రావుపై రేవంత్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమన్నారు. నాయకత్వం అనేది రాజకీయ పార్టీల అంతర్గత వ్యవహారమని, పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్‌ను నియమించినప్పుడు బీఆర్ఎస్ పార్టీని అడిగారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో అనేక మంది దళిత నాయకులు ఉన్నారని, పీసీసీ అధ్యక్షుడిగా మరి వాళ్లను ఎందుకు చేయలేదని దుయ్యబట్టారు. ఎవరు సీఎం అయితే ఎక్కువ మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకున్నదని తెలిపారు. తమ పార్టీ 2014కు ముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పిందని, అప్పుడు తమ పార్టీ అధికారంలోకి రాలేదని, అప్పటికి దళితుడైన విజయరామారావును ఫ్లోర్ లీడర్‌గా చేశామని గుర్తు చేశారు. కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణకు ఉద్యమ నాయకుడు కేసీఆర్ సీఎం కాకపోతే రాష్ట్రానికి నష్టం జరిగేదని అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్ర పరిస్థితి ఏవిధంగా తయారైందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. మల్లికార్జునఖర్గే కాంగ్రెస్ పార్టీ డమ్మీ అధ్యక్షుడని, వెనుక ఉండి నడిపించేదంతా రాహుల్‌గాంధీయేనని తెలిపారు. రాహుల్, ప్రియాంకకు పార్టీలో ఏ హోదా ఉన్నదని గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు డిక్లరేషన్లు ఇప్పించారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

**కేసీఆర్ ఆడుగుజాడల్లోనే నడుస్తం**

తమ పార్టీకి కేసీఆరే నాయకుడని, ఆయన అడుగు జాడల్లోనే తామంతా నడుస్తామని కొప్పుల స్పష్టంచేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మంత్రివర్గ విస్తరణ చేపడితే తన పదవికే ఎసరు వస్తుందని రేవంత్‌రెడ్డి భయపడుతున్నాడని అన్నారు. బిల్లా, రంగాలని తమ పార్టీ నేతలను సంబోధించడం వల్ల రేవంత్‌రెడ్డి సీఎం పదవి స్థాయిని తగ్గించారని పేర్కొన్నారు. బిల్లా, రంగా చేష్టలు రేవంత్‌రెడ్డివేనని, ఈ స్థాయిని కూడా ఆయన ఎప్పుడో దాటిపోయి ఇపుడు చార్లెస్ శోభారాజ్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. పాలన చేతకాక పనికిమాలిన మాటలన్నీ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అంబేద్కర్‌ను ఓడించి, జగ్జీవన్‌రాంను అవమానించిన కాంగ్రెస్ పార్టీ తమకు నీతులు చెప్పడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులకు రెండుసార్లు డిప్యూటీ సీఎం ఇచ్చిన ఘనత తమ పార్టీదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అంతర్గత వ్యవహారాలపై జోక్యం తగ్గించి పాలనపై దృష్టిపెడితే రేవంత్‌కు మంచిదని హితవు పలికారు. తాను సీఎం పదవిలో ఉండి వేరే వారిని సీఎం అని సంబోధించే స్థాయికి రేవంత్ దిగజారారని, ముందు చేవెళ్లలో ఇచ్చిన దళిత డిక్లరేషన్‌ను అమలు చేయాలని కొప్పుల డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ప్రసాద్, ఏలేటి కృష్ణారెడ్డి, గుంజపడుగు హరిప్రసాద్, మైఖేల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అందగత్తెల కాళ్లు కడగడం అవమానకరం

రాష్ట్ర ప్రభుత్వంపై సీపీఎం ఫైర్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడమే కాకుండా, తెలంగాణ ఆడబిడ్డలతో పోటీదారుల కాళ్లు కడిగించడం ఎంతో అవమానకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రేవంత్ సర్కార్‌పై మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రపంచ సుందరి పోటీదారులు వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా ప్రభుత్వం అక్కడి పూరిగుడిసెలను తొలగించి, చిరువ్యాపారులు లేకుండా చేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి దిగజారిన పద్ధతుల్లో వ్యవహరిస్తున్నదో అనేందుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించి వెంటనే క్షమాపణ చెప్పాలని, దీనిపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఉచిత దర్శనం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న సాధువులు

## సరస్వతీ పుష్కరాల్లో భక్తుల అసంతృప్తి

నిర్వహణ తీరుపై సాధువుల పెదవి విరుపు

మహదేవపూర్(కాళేశ్వరం), మే 16 : సరస్వతీ పుష్కరాల్లో అధికారుల తీరుపై భక్తులు, సాధువులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఆదాయం కోసమే చూస్తున్నారని, సామాన్య భక్తుల ఇబ్బందులను పట్టించుకోలేదని మండిపడుతున్నారు. సాధువులైన తమ వద్ద దర్శనం కోసం వంద రూపాయలు వసూలు చేయడం దారుణమని అన్నారు. పుష్కరాల ఏర్పాట్ల కోసం రూ.35 కోట్లు వెచ్చించినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నా ఇక్కడ చేసిందేమీ లేదని పేర్కొన్నారు. సాధారణ భక్తుల వద్ద కాళేశ్వరంలో గ్రామ పంచాయతీ పేరిట ప్రతి వాహనానికి రూ.100 వసూలు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

## కాబోయే మంత్రి శ్రీహరి

పాలమూరులో మంత్రి జూపల్లి కామెంట్స్

మహబూబ్‌నగర్, మే 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాబోయే మంత్రి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అంటూ పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించడం చర్చనీంశంగా మారింది. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రిని ప్రపంచ సుందరీమణులు సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో శ్రీహరికి మంత్రి పదవి రాబోతున్నదని తెలుపడంతో ఎమ్మెల్యేలు వేదిక మీదే చర్చించుకున్నారు.

## ఎల్లూరు అటవీలో పులి కళేబరం?

కుమ్రంభీం ఆసిఫాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ డివిజన్ ఎల్లూరు అటవీ ప్రాంతంలో దుండగులు పులిని హతమార్చినట్టు తెలిసింది. అటవీ అధికారులు ఈ విషయంపై అంతర్గతంగా విచారణ జరుపుతున్నట్టు సమాచారం. గతేడాది కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో కొంతమంది దుండగులు రెండు పులులపై విష ప్రయోగం చేసి హతమార్చిన ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. తాజాగా.. ఎల్లూరు అటవీ ప్రాంతంలో దుండగులు పులిని హతమార్చిన ఘటన అటవీశాఖలో కలకలం రేపుతున్నది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన అధికారులకు శుక్రవారం పులి కళేబరం లభ్యమైనట్టు తెలిసింది.

## క్రికెట్‌లో యువకుల మధ్య గొడవ

- యువకుడిపై ఐదుగురి దాడి
- చికిత్స పొందుతూ మృతి

అమరచింత, మే 16: క్రికెట్ ఆడుతున్న యువకుల మధ్య మొదలైన గొడవలో ఓ యువకుడిపై ఐదుగురు వ్యక్తులు దాడి చేయగా.. చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. నాగల్‌కడ్మూర్, ధర్మాపూర్‌కు చెందిన యువకులు మంగళవారం మధ్యాహ్నం క్రికెట్ ఆడుతున్న క్రమంలో ఆంజనేయులు(30)పై ఐదుగురు వ్యక్తులు దాడి చేయడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. గురువారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ విషయమై రెండు గ్రామాల పెద్దలు పంచాయితీ నిర్వహించి మృతుడి కుటుంబసభ్యులకు రూ.12 లక్షలు ఇవ్వాలని నిర్ణయించారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

అవార్డు పొందిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, ఇతర విభాగాల్లో అవార్డులు పొందిన పలు దేశాల పోలీసు ప్రతినిధులు

## హైదరాబాద్ పోలీస్‌కు అరుదైన గౌరవం

- యాంటీనార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక గుర్తింపు
- వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో అవార్డు అందుకున్న కమిషనర్ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): ఈనెల 13 నుంచి 16 వరకు దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ పోలీస్ సమ్మిట్-2025లో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కమిషనర్ సీవీ ఆనంద్.. సమ్మిట్‌లో ఎక్సలెన్స్ ఇన్ యాంటీనార్కోటిక్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకుని అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యలతోపాటు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన అవగాహన కార్యక్రమాలు, గత మూడేండ్లలో సాధించిన విజయాలకు ఈ అవార్డు దక్కినట్టు తెలిపారు. సమ్మిట్‌లో 138దేశాల నుంచి అధికారులు పాల్గొన్నారని, వారితో పోటీపడి ఈ అవార్డును గెలుచుకోవడం ఆనందంగా ఉన్నట్టు తెలిపారు. అవార్డు సాధనలో తన బృందం సభ్యుల కృషి, అంకితభావం కీలకమని చెప్పారు.

## రాష్ట్రంలో ఏఐ ఆధారిత క్యాన్సర్ స్క్రీనింగ్

- ముందుస్తు నిర్ధారణే లక్ష్యం
- మూడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్ట్
- నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై ప్రభుత్వం ఫోకస్

హైదరాబాద్, మే 16 (నమస్తే తెలంగాణ): క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సేవలను వినియోగించాలని వైద్యారోగ్య శాఖ భావిస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఏఐ ఆధారిత స్కాన్ ద్వారా హై రిజల్యూషన్ ఇమేజింగ్, కచ్చితమైన ఫలితాలు సాధించాలని ప్రణాళిక రూపొందిస్తున్నది. ఈ స్కాన్‌లో క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన తర్వాత ఆ ఫలితాలను నిపుణులైన వైద్యులు, ఆంకాలజిస్టులకు పంపి వ్యాధి నిర్ధారణ చేయనున్నారు. ఇందుకుగాను పైలట్ ప్రాజెక్టులో వచ్చిన ఫలితాలను బట్టి రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలల్లో ఈ అధునాతన సాంకేతికతను తేవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసే ప్రక్రియ ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానలో కొనసాగుతున్నట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం డే కేర్ సెంటర్‌లను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తున్నది. నోరు, రొమ్ము(బ్రెస్ట్ క్యాన్సర్), గర్భాశయ క్యాన్సర్లను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు దేశవ్యాప్తంగా క్యాన్సర్ రోగుల నిర్ధారణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నది.

**మెడికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ..**

రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియను సమర్థంగా నిర్వహించడానికి ఏఐ ఆధారిత డయాగ్నోస్టిక్స్, విధానాలపై మెడికల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న రోగులను తదుపరి నిర్ధారణ, చికిత్స కోసం ఎంఎన్‌జే క్యాన్సర్ దవాఖానతోపాటు నిమ్స్‌కు రిఫర్ చేయనున్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, ఆదిలాబాద్‌లలో కీమోథెరపీని అందుబాటులోకి తేనున్నారు. తద్వారా పేదలకు మరింత సేవ లందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఆరోగ్యశాఖలో ఏఐని విస్తృతంగా వినియోగించుకోవాలని కేంద్రం భావిస్తున్నందున ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్టు తెలుస్తున్నది. రాష్ట్రంలో రేడియాలాజిస్ట్‌ల కొరత ఉండటంతో ఏఐ ఆధారిత సాధనాలు వినియోగించుకోవడం ద్వారా ఈ లోటును భర్తీ చేయాలని భావిస్తున్నది.

# 100 కోట్ల ఇంపోర్టెడ్ కార్ల కుంభకోణం

- బషారత్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్న డీఆర్‌ఐ అధికారులు
- నకిలీ పత్రాలతో తక్కువ ధర చూపించి కోట్ల ట్యాక్స్ ఎగవేత
- బషారత్‌ఖాన్ వెనుక ముఖ్యనేత అనుచరులున్నట్టు అనుమానం
- ఓ యువ ఎంపీ, ముఖ్య నేత అనుచరుడితో సంబంధాలు?
- 2 కార్లు కొనుగోలు చేసిన టాలీవుడ్ ప్రముఖ నటులు..!
- ఈసీఐఆర్ నమోదు చేసే యోచనలో ఈడీ అధికారులు

సూరత్‌లో డీఆర్‌ఐ అధికారులు అదుపులోకి తీసుకున్న లగ్జరీ కార్ల విక్రేత బషారత్‌ఖాన్

హైదరాబాద్/సిటీబ్యూరో, మే 16 (నమస్తే తెలంగాణ): వంద కోట్ల రూపాయల పన్ను ఎగవేత కేసులో లగ్జరీ కార్ల విక్రేత బషారత్ ఖాన్‌ను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) అధికారులు గురువారం సూరత్‌లో అరెస్ట్ చేశారు. విజయనగర్ కాలనీకి చెందిన బషారత్‌ఖాన్ హైదరాబాద్ కేంద్రంగా గచ్చిబౌలిలో లగ్జరీ కార్లను విక్రయిస్తూ వంద కోట్ల కస్టమ్స్ డ్యూటీ ఎగవేసినట్టు డీఆర్‌ఐ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఖాన్ అమెరికా, జపాన్ నుంచి లగ్జరీ కార్లను కొనుగోలు చేసి దుబాయ్, శ్రీలంకకు తరలించేవాడని తెలిపారు. అక్కడ వాటిని లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ నుంచి భారత రవాణా చట్టాలకు అనుగుణంగా రైట్ హ్యాండ్ డ్రైవ్‌గా మార్పులు చేసి తప్పుడు డాక్యుమెంట్లు, ఇన్‌వాయిస్‌లతో దేశంలోని దిగుమతి చేసేవాడని వివరించారు. ఈ పద్ధతిలో ఇప్పటివరకు 30వరకు ఖరీదైన కార్లను దిగుమతి చేసుకొని ఇతరులకు విక్రయించినట్టు గుర్తించారు. ఈ క్రమంలో కస్టమ్స్ సుంకాన్ని 50శాతం వరకు ఎగవేసినట్టు తెలిపారు. గత పదేండ్లుగా లగ్జరీ కార్ల షోరూమ్‌ను నిర్వహిస్తున్న బషారత్‌ఖాన్ హమ్మర్ ఈవీ, క్యాడిలాక్ ఎస్కలేడ్, రోల్స్‌రాయిస్, లెక్సస్, టయోటా ల్యాండ్‌క్రూజర్, లింకన్ నావిగేటర్ వంటి ఖరీదైన మోడల్స్ విక్రయించాడని పేర్కొన్నారు. ఒక్క హైదరాబాద్‌లోనే 8 కార్లను విక్రయించిన ఖాన్ తెలంగాణ ప్రభుత్వానికి రూ.7 కోట్లకు పైగా పన్ను ఎగవేసినట్టు గుర్తించారు. ఇక దేశ వ్యాప్తంగా ఈ కుంభకోణం మొత్తం రూ.100 కోట్లకు పైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కార్ల క్రయవిక్రయాల్లో భారీగా చేతులు మారినట్టు గుర్తించిన ఈడీ సైతం ఈ కేసుపై కన్నేసినట్టు తెలిసింది. బషారత్‌ఖాన్ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు ఈడీ కూడా ఈసీఐఆర్‌ను నమోదు చేసినట్టు సమాచారం.

**ముఖ్యనేత అనుచరలతో సంబంధాలు?**

బషారత్‌ఖాన్‌కు తెలంగాణ ముఖ్య నేత అనుచరులతో సంబంధాలు ఉన్నట్టు డీఆర్‌ఐ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ యువ ఎంపీ, యువ ఎమ్మెల్యేతోపాటు, మరో కాంగ్రెస్ ఎంపీతో కూడా సంబంధాలున్నట్టు గుర్తించారని సమాచారం. ఆ యువ ఎమ్మెల్యే లగ్జరీ కార్లను నిత్యం మారుస్తూ ఉంటాడని చెప్పుకుంటున్నారు. లగ్జరీ కార్లకు పన్ను విషయంలో ఎవరైనా అధికారులు అడ్డుపడితే.. వారిని నయానో.. భయానో లొంగదీసుకోవడం ముఖ్య నేత పక్కన తిరిగే ఆ మైనార్టీ నేతకు వెన్నెతో పెట్టిన విద్యగా ఆరోపణలు ఉన్నాయి. కార్లు మార్చే పనులన్నీ బషారత్‌ఖాన్ చూసుకుంటే.. అందుకు కావాల్సిన బ్యాక్‌గ్రౌండ్ సపోర్ట్ మొత్తం ఆయనే చూసుకుంటారట. మరో కాంగ్రెస్ ఎంపీతో కూడా ఆయనకు సత్సంబంధాలు ఉన్నాయని.. దేశవ్యాప్తంగా వ్యాపారం సాగించడంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆ ఇద్దరు ఎంపీలు కీలకపాత్ర పోషిస్తారని తెలిసింది. ఈ క్రమంలో బషారత్‌ఖాన్ నిత్యం హైదరాబాద్ నుంచి ఢిల్లీకి విమానాల్లో తిరుగుతుంటాడని, అక్కడ బేరసారాలు కుదిరిన తర్వాత కారును డెలివరీ చేస్తాడని డీఆర్‌ఐ అధికారులు గుర్తించారు.

**లగ్జరీ కార్లు కొన్న సినీ ప్రముఖులు..**

టాలీవుడ్‌కు చెందిన ఇద్దరు ప్రముఖ హీరోలు బషారత్‌ఖాన్ నుంచి లగ్జరీ కార్లను కొనుగోలు చేశారని విశ్వసనీయ సమాచారం. ఈ విషయం అధికారుల దర్యాప్తులో తేలినట్టు తెలిసింది. తన వ్యాపార భాగస్వామి డాక్టర్ అహ్మద్‌తో కలిసి అక్రమంగా దిగుమతి చేసుకున్న లగ్జరీ కార్లను ఫామ్‌హౌస్‌లో ఉంచేవారని, కొనుగోలు చేసిన కార్లకు పన్నుల బాధ లేకుండా నగదు రూపంలోనే వసూలుచేసే వారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఖాన్‌ను అహ్మదాబాద్‌లో జ్యుడీషియల్ కస్టడీకి తరలించిన అధికారులు, తదుపరి దర్యాప్తు జరుగుతున్నదని తెలిపారు.

**ఎవరీ బషారత్‌ఖాన్..**

బషారత్‌ఖాన్ మొదట్లో చిన్నచిన్న కార్లు విక్రయించేవాడు. అతనికి రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడిన తర్వాత ఖరీదైన కార్లను విక్రయించడం ప్రారంభించాడు. బషారత్ తన షోరూమ్‌లోని పలు కార్లను రాజకీయ నాయకులు ఉపయోగించేలా రూపొందించేవాడు. ఈ క్రమంలో అతడు పలువురు పార్లమెంటు సభ్యులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకున్నాడు. డాక్టర్ అహ్మద్‌తో కలిసి హైఎండ్ కార్లను నకిలీ పత్రాలతో దిగుమతి చేసుకునేవారు. బ్లాక్ మనీని వైట్‌మనీగా మార్చడానికి కార్లను నగదు తీసుకొని విక్రయించేవారు.

# పాడే మోసేందుకు నలుగురు కరువు

పంచాయతీ సిబ్బందితో తనయుడి మృతదేహం ఖననం • తల్లడిల్లిపోయిన తల్లి ప్రాణం • ములుగు జిల్లా కేంద్రంలో ఘటన

*ములుగు, మే 16 (నమస్తే తెలంగాణ): అనారోగ్యంతో ప్రభుత్వ దవాఖానకు వచ్చిన కొడుకు మృతి చెందగా, పాడె మోసేందుకు నలుగురు లేక, ఖననం చేసేందుకు తల్లి చేతిలో చిల్లిగవ్వ లేక, పిడికెడు పూలను కొడుకు శవం మీద చల్లి చేతులెత్తి మొక్కి పంచాయతీ సిబ్బందితో కాటికి సాగనంపింది. ఈ హృదయ విదారక ఘటన ములుగు జిల్లాకేంద్రంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన లచ్చమ్మ ఒక్కగానొక్క కొడుకు రాజు (20) ఈనెల 14 తెల్లవారుజామున చేతి మణికట్టు వద్ద కత్తితో కోసుకున్నాడు. గాయపడిన రాజును తల్లి లచ్చమ్మ ములుగు దవాఖానకు తీసుకొచ్చింది. వైద్యులు ప్రథమ చికిత్స చేయగా, కడుపు నొప్పి ఉందంటూ రాజు దవాఖానలోనే ఉన్నాడు. పని చూసుకొని తిరిగి వస్తానని తల్లి కొడుకును దవాఖానలోనే ఉంచి మల్లంపల్లికి వెళ్లింది. కొడుకు చనిపోయినట్టు సమాచారం రావడంతో పరుగున దవాఖానకు చేరుకున్నది. కొడుకు తలపగిలి చనిపోయి కనిపించాడు. కొడుకు ఎందుకు చనిపోయాడో తెలియని తల్లి గుండెలవిసేలా రోదించింది. కింద జారిపడి చనిపోయాడని దవాఖాన సిబ్బంది ఆమెకు తెలిపి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. గురువారం పోలీసులు విచారణ చేపట్టి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లికి అప్పగించే ప్రయత్నం చేశారు. కొడుకు మృతదేహాన్ని ఇంటి వరకు తీసుకెళ్లేందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతోపాటు మల్లంపల్లిలో సొంత ఇల్లు కూడా లేదని రోదించింది. దీంతో పోలీసులు తల్లి నిర్ణయం మేరకు గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారం అందించారు. ములుగు పంచాయతీకి చెందిన జేసీబీ ముందు డోజర్‌లో రాజు మృతదేహాన్ని తీసుకెళ్తుండగా, బరువెక్కిన హృదయంతో తల్లి పిడికెడు పూలను కొడుకు మృతదేహంపై చల్లి ఏడుస్తూ సాగనంపింది.*



**న్యాయం చేయాలి : తల్లి లచ్చమ్మ**

తన కొడుకు దవాఖానలో జారిపడటంతో నెత్తికి దెబ్బతాకి చనిపోయినట్టు సిబ్బంది చెప్తున్నారని, ఎస్సై సారు, దవాఖాన పెద్ద సారు సీసీ కెమెరాలు చూస్తే అందులో రాజు దవాఖాన పైనుంచి దూకి చనిపోయినట్టు ఉన్నదని తల్లి లచ్చమ్మ తెలిపింది. పెద్దసార్లు ఎందుకు అబద్ధం ఆడుతున్నారో తెలుస్తలేదని ఆమె విలపించింది. తనకు న్యాయం చేయాలని వేడుకున్నది.

**సూపరింటెండెంట్ వివరణ..**

ఈ విషయమై సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. దవాఖాన ఆవరణలో జారి పడడంతో గాయమై చనిపోయాడని తెలిపారు.